కల్లబొల్లి కబుర్లతో
ఆమెని ఆకర్షించలేకపోయిన
అతడి అహంకారం
అణిగిందా?

# ఓ మగాడి కథ!

**అనుపిండి శ్రీనివాసరావు కథ**

‘‘హలో!’’

పుస్తకంలోంచి తలెత్తి చూసింది మైథిలి.

‘‘మీరా?’’

ఆశ్చర్యంగా అంది. ఎదురుగా కిరీటి నవ్వుతూ నిలబడి వున్నాడు.

‘‘ఎంత మీ బెర్త్ నెంబర్?’’

‘‘ఫార్టీ ఎయిట్!’’ చెప్పింది.

‘‘ఎగైన్ సర్‌ప్రైజింగ్. నాది ఫార్టీ సెవెన్!’’

‘‘థాంక్ గాడ్!.. అప్పర్ బెర్త్ వచ్చిందని భయపడుతుండగా ఆక్సిడెంటల్‌గా మీరొచ్చారు!’’

‘‘నిజంగా యాక్సిడెంటల్! మీరు ఎంత వరకు?’’

‘‘నర్సాపురం!’’

‘‘నేనూ అక్కడికే! కంపెనీ దొరికారు. ఒక్కడినే వెళ్ళాలేమోనని భయపడ్డాను’’

‘‘అఫ్ కోర్స్!... కానీ ఫుల్ నైట్ జర్నీయేగా!’’ నవ్వుతూ అంది మైథిలి.

‘‘భలేవారే... ఈ ఫిఫ్టీసిక్స్ పేరుకే ఎక్స్‌ప్రెస్, కానీ నత్తనడక నడుస్తుంది! మార్నింగ్ టెన్‌కి మనం చేరితే చాలా గొప్ప విషయమే!’’

ఇంతలో కంపార్ట్‌మెంట్ టిటిఇ టికెట్స్ వెరిఫికేషన్‌కి వచ్చాడు. మవునంగా అందరి టికెట్స్ చూడసాగాడు.

‘‘ఇఫ్ యుడోంట్ మైండ్... మిమ్మల్నొకటి అడగొచ్చా?’’ కిరీటి టిటిఇని అడిగాడు

అతను ఆశ్చర్యంగా ‘‘ అడగండి!’’ అన్నాడు.




"ఏం లేదు! ఆర్ఏసి, వెయిటింగ్ లిస్టు అవి అని రెండు కోటాలు పెట్టడం, చివర్లో అందర్నీ కన్‌ఫర్మ్ చెయ్యడం ఈ ట్రైన్ స్పెషాలిటీయా?"

"కాదనుకోండి. అపుడపుడు ఎక్స్ట్రా బోగీస్ వేసినపుడు అలా జరుగుతూ వుంటుంది!"

"అపుడపుడంటే ఎల్లప్పుడూ అనా?"

కిరీటి వ్యంగ్యంగా ప్రశ్నించాడు. టిసి ఏం మాట్లాడలేదు. ఇలాంటి విషయాలన్నిటికీ జవాబు చెప్పాల్సిన బాధ్యత, అవసరం అతనికి లేవు. పోనీలే అని చెప్పడం మొదలెడితే. తామే అతి తెలివైన వాళ్ళమనుకుని రైల్వే డిపార్ట్‌మెంట్‌లో వర్క్ సరిగా చెయ్యరని ఇష్టమొచ్చినట్లు వాగుతుంటారు ఇలాంటి వాళ్లు! మవునంగా కిరీటికి బెర్త్ ఫీ రిసీట్ రాసిచ్చి డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

"మాట్లాడటం లేదు చూశారా?... ఖాళీల గురించి సరిగ్గా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఆర్‌ఏసిలు అవీ ఇచ్చేస్తూ వుంటారు వీళ్ళు!"

కిరీటి మైథిలి కేసి చూస్తూ చెప్పాడు.

"కానీ ఇపుడు కంప్యూటరైజ్ చేశారు కదా!"

మైథిలి అతని మాటలు అర్థంకాక ఆశ్చర్యంగా అంది. మరెవరైనా అయితే అంతటి సూటి ప్రశ్నకి తడబడేవారే! కానీ తడబడటం, తమ తప్పుని వప్పుకోవడం అనేవి కిరీటి లాంటి వాళ్ళ డిక్షనరీలలో వుండవు!

"ఇంక చెప్పడానికేముంది?" అని ఎదురు ప్రశ్నించాడు. చదువుకోని వాడు ఎవడో కంప్యూటర్ అంటే ఏమిటో తెలియని వాడు ఎవడో అలా మాట్లాడితే అనుకోవచ్చు. కానీ బాగా ఎడ్యుకేటెడ్ అయిన కిరీటి అలా అడగడం మైథిలికి వింతగా అనిపించింది.

"ఇవాళంతా చాలా అలిసిపోయాము. గుడ్‌నైట్!"

అని చెప్పి కిరీటి పైబెర్త్ చేరి ఎయిర్ పిల్లో సూట్‌కేస్ లోంచి తీసి అందులో గాలి నింపి పడుకోవడానికి ఉపక్రమించాడు. అతనికి బాగా ఆశ్చర్యంగా వుంది. మైథిలి ఇంత అకస్మాత్తుగా ఊహించలేని విధంగా ట్రైన్‌లో ఎదురవుతుందని తను ఎంతమాత్రం అనుకోలేదు. ఆ మాటకొస్తే మైథిలితో అతనికి పెద్ద పరిచయమేం లేదు. అతను ప్రతీ రోజూ ఆఫీస్‌కి వెళ్ళే బస్సులోనే ఆమె కూడా ఎక్కుతూ వుంటుంది. మొదటి రోజే ఆమెని చూడగానే పక్కానికొచ్చిన బంగిన పల్లె మామిడి పండు గుర్తొచ్చింది అతనికి. రోజూ ఆమె అదే బస్‌లో వస్తూండటంతో కొన్నాళ్ళకి ధైర్యం చేసి నవ్వాడు. ఆమె కూడా చిన్నగా బదులిచ్చింది. ఆ తర్వాత మాటలు కలిపి ఆమె లెక్చరర్‌గా వర్క్ చేస్తోందని తెలుసుకున్నాడు. ఇంకా ఎడ్వాన్స్ అవ్వాలని చాలా ప్రయత్నించాడు కానీ ఆమె ఎప్పుడూ అలాంటి అవకాశం ఇవ్వటంలేదు.

ఈ రోజు అకస్మాత్తుగా అతను కలలో కూడా ఊహించని అవకాశం అదృష్టవశాత్తూ లభించింది. దీన్ని ఎంత కష్టపడి అయినా సద్వినియోగం చేసుకుని తీరాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు కిరీటి. తన తెలివి తేటలతో మాటల చాతుర్యంతో ఆమెని ఈ జర్నీలో బాగా ఇంప్రెస్ చేసి కొద్దిగా దారిలో పెట్టుకోవాలని తీర్మానించుకుని దానికి సంబంధించిన ఆలోచనలతోనే నిద్రపోయాడు కిరీటి!

ఉదయం అతనికి మెలుకువ వచ్చేసరికే మైథిలి లేచి కూర్చుని నవల చదువుకుంటోం

ది! చిన్నగా తనలోతనే నిట్టూర్చాడు కిరీటి. సమయం తక్కువగా వుంది కనుక కొద్దిగా ముందర లేచి వుండి వుంటే బాగుండేదనుకున్నాడు. తన భావాల్ని తనలోనే దాచుకుని ఆమెకు విష్ చేశాడు కిరీటి.

"గుడ్ మార్నింగ్, మాడమ్!"

"వెరీగుడ్ మార్నింగ్!"

చిరునవ్వుతో బదులిచ్చింది. అప్పటికే కడిగిన ముత్యంలా తయారయిన ఆమెని చూస్తే కిరీటికి ఆశ్చర్యమేసింది. ప్రొద్దున్న ఎనిమిదింటి వరకూ నిద్రపోవడం అతని అలవాటు! బ్రెష్, పేస్ట్, టవల్ తీసుకుని బాత్ రూమ్‌లోకెళ్ళి రిఫ్రెష్ అయివచ్చాడు

"ఏం నవల అది?" ఆమెని ప్రశ్నించాడు.

"మైదానం!"

"చలందా?"

"అవును! ఆయనదే!"

"పెద్ద బాగోదులెండి!" పెదవి విరుస్తూ అన్నాడు కిరీటి. దేనినైనా మెచ్చుకపోవడం, మెచ్చినా మెచ్చామని చెప్పకపోవడం కిరీటి లక్షణం!

"మీరు చదివారా?" మైథిలి అడిగింది.


"ఎప్పుడో!" అతని ఉద్దేశ్యం ఏమిటంటే 'నీ కన్నా చాలా ముందు వున్నాను సుమా' అని ఆమెకి తెలియచెయ్యడం! కానయితే అతను ఊహించలేని విషయమేమిటంటే—

"నేనీ నవలని వందోసారి అనుకుంటూ చదవటం!" అంది మైథిలి.

ఆ జవాబుకి కిరీటి ఉలిక్కి పడ్డాడు. ఒక్క క్షణంపాటు ఏం మాట్లాడాలో తెలియలేదు. అంతలో అతనిని ఆ ఆపదనుండి రక్షించటానికా అన్నట్లుగా ట్రైన్ స్లో అవసాగింది.

"గుడివాడ వస్తున్నట్లుంది కాఫీ తెస్తాను ఉండండి. తాగాక మాట్లాడుకుందాం!"

## గుండెలో సూది!



బ్రిటన్‌లోని డేన్వర్ ఆసుపత్రికి మొన్నీ మధ్యన గుండె నొప్పి అంటూ ఓ స్త్రీ వచ్చింది. ఆమెను పరీక్షించిన డాక్టర్ జేమ్స్ బ్యాచ్‌మన్ ఆమెగుండెలో ఓ సూది ఉన్నట్లు గుర్తించటంతో వైద్య ప్రపంచం అబ్బురపొందింది! డాక్టర్లు గుచ్చి గుచ్చి అడుగగా... ఆమె గుర్తు తెచ్చుకొని ఓసారి కిందపడినపుడు తనచేతిలోని సూది మాయమైనట్లు... అది రొమ్ములో గుచ్చుకుని లోపలికి వెళ్ళి ఉండవచ్చునంది! ఆ తర్వాతే తనకు గుండెనొప్పివచ్చి ఆసుపత్రికి వెళ్ళిందట! ఏది ఏమైతేనేం డాక్టర్లు ఆపరేషన్‌చేసి సూదిని బయటకు తీసి మళ్ళీ ఆమెను మామూలు మనిషిని వేయటంతో కథ సుఖాంతం అయింది. —జూపిటర్

అని ఆమెకి మాట్లాడే ఛాన్స్ ఇవ్వకుండా వేగంగా ఆమె నుంచి వచ్చేసి ట్రైన్ సరిగా ఆగకుండానే క్రిందికి దిగాడు కిరీటి. అప్పటికే తన మాటల్ని సమర్థించుకుంటూ ఒక వాదనని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడు. దూరంగా వున్న రైల్వే వెండర్ దగ్గరికి వేగంగా వెళ్ళి రెండు కప్‌ల కాఫీ తీసుకుని మైథిలి కూర్చున్న కిటికీ దగ్గరికి వచ్చాడు. అతని దృష్టిలో అదో పెద్ద ఘనకార్యం. తను ఆమె పట్ల చూపుతున్న ఇంట్రెస్టుకి ఆమె తప్పక కరిగిపోతుందని అతని భ్రమ.

"తీసుకోండి!" గొంతులో ప్రేమని లాలిత్యాన్ని ప్రదర్శించాడు కిరీటి.

"నో థాంక్స్!" మైథిలి బదులిచ్చింది.

"పర్లేదు—"

"నేను ఇందాక విజయవాడలో తాగానండీ! వద్దు!"

"పర్లేదు! వేడినీళ్ళే ఇవి. కాఫీ అనుకుంటున్నారా?"

అంటూ ఓ కుళ్ళు జోకేశాడు. ఆమె ఆ జోక్‌కి ఇబ్బందిగా చూస్తూ "నేను కాఫీ, టీలు తాగనండి!" అంది.

"మరి మిల్క్ తీసుకుంటారా?"

మైథిలి అవునన్నట్లు తలూపింది.

"వుండండి! అయితే అదే తెస్తాను!"

"వద్దండి! మీకు ఇబ్బంది... "ఆమె ఏదో చెప్పపోయింది. కిరీటి చాలా సేపట్నుంచీ ఈ పదం కోసమే చూస్తున్నాడు!

"ఇబ్బంది ఏముందండి! ఇట్స్ ఎ ప్లెజర్ టు మి!" అని హీరో లెవల్లో చెప్పి మళ్ళీ ఆ కాఫీ అమ్ముతున్న వ్యక్తి దగ్గరికెళ్ళి పాలు ఇవ్వమని అడిగాడు. వేడినీళ్ళు తప్పించి వాడి దగ్గర పాలులేవు. కిరీటికేం చెయ్యాలో తోచలేదు. తీసుకెళ్ళకపోతే ఆమె ముందు 'ఇన్సల్టు' ఫీలవ్వాలి.

"సరిగ్గా చూడవయ్యా! అయిదు రూపాయలిస్తాను!" అని వాడిని రిక్వెస్టు చేశాడు.

"ఐదు కాదు కదా వందిచ్చినా నాకాడలేనివి మీకెట్టా ఇయ్యగలను బాబయ్యా?" అని వాడు ఎదురు ప్రశ్నించాడు. చేసేదేం లేక ఏడుపు మొహం వేసుకుని తిరిగి కిటికీ దగ్గరికెళ్ళాడు.

"సారీ... మిల్క్ ఇక్కడ దొరకటంలేదండి..." ఆ మాటలంటున్నపుడు కిరీటి చూపులు తన శరీరంలోని ఒక భాగం దగ్గర ఆగడాన్ని నవలలో మునిగివున్న మైథిలి గమనించలేదు.

"ఇట్స్ ఓ.కె" అంది మామూలుగా.

"డామ్ ఇండియా!... తన పౌరులకి తాగడానికి పాలు కూడా సప్లై చెయ్యలేకపోతోందీ దేశం!" అన్నాడు డ్రమటిక్‌గా. అక్కడికి ఇండియా అనేది ఏదో పాలబూత్ అయినట్లు! ఇంతలో ట్రైన్ కదలసాగింది.

"కమాన్! ఎక్కండి!" అంది మైథిలి ఆదుర్దాగా అతను ఇంకా ప్లాట్‌ఫామ్ మీదే నిలబడటం చూసి కిరీటికి గొప్ప ఆనందమేసింది!

"కంగారుపడకండి.. నాకలవాటే..."

అన్నాడు ట్రైన్ ఎక్కే ప్రయత్నమేం చెయ్యకుండా. ట్రైన్ వేగం మరికొంత పెరిగాక పరిగెట్టి దాన్ని ఎక్కి తన హీరోయిజం, శారీర ధారుడ్యం ఆమె ముందు ప్రదర్శించొచ్చని అతని ఆశ!

"కమాన్... రండి... క్విక్..."

అప్పటికే ట్రైన్ వేగం పుంజుకుంది. కిరీటి ఇది చాలా మామూలు ఫీట్ అనుకున్నాడు. వేగంగా పరిగెత్తి ట్రైన్ అందుకునే ప్రయత్నం చెయ్యసాగాడు. సరిగ్గా అతను డోర్ రాడ్‌ని పట్టుకోగానే ప్లాట్‌ఫామ్ పూర్తి అయింది. ఒక్క స్ప్లిట్ సెకండ్ లేట్ అయినా అది గమనించని కిరీటి బొక్క బోర్లా క్రిందపడే వాడే! థాంక్ గాడ్ అనుకున్నాడు లోపల. అప్పటికే పరిగెత్తడం వల్ల, కంగారువల్ల హృదయ స్పందన హెచ్చి చమట్లు పడుతున్నాయి. వేగంగా ఎక్కడం లో మోకాలు డోర్‌కి తగిలి కొద్దిగా నొప్పిగా వుంది. ఫాంట్ పైకెత్తి దెబ్బ ఏమైనా తగిలిందేమోనని చూసుకోసాగారు.

''నేను చెపితే విన్నారా?''?

ఎపుడొచ్చిందో, మైథిలి ఎదురుగా నిలబడి వుంది.

హీరోయిజం మాట దేవుడెరుగు, తలని తీసి చొక్కా జేబులో పెట్టుకోవాలనిపించింది కిరీటికి!

''ఏం లేదు...'' అన్నాడు మామూలుగా అయిపోయి.

''ఇలా పరిగెట్టి బస్సులు, ట్రైన్‌లు ఎక్కేవాళ్ళంటే నాకు తగని చిరాకండి! ఆగివున్నపుడు ఎక్కొచ్చుగా....'' మైథిలి చిరాగ్గా అని సీట్‌కేసి దారితీసింది. వెర్రి నవ్వొకటి నవ్వుతూ ఆమెని అనుసరించి నడిచాడు. నడుస్తూంటే కాలు కలుక్కుమంది. బాధని లోపలే అదిమిపట్టి పైకి నవ్వుతూ వుండటానికి కిరీటి విశ్వప్రయత్నం చెయ్యాల్సి వచ్చింది.

''అదేమిటి అలా అయిపోయారు?.. దెబ్బకాని తగలలేదు కదా!''

''లేదు... లేదండీ!''

నవ్వలేక నవ్వలేక నవ్వి సీట్‌లో కూర్చున్నాడు. ఆమె సీట్‌లో కూర్చుని నవల అందుకుంటూ ఏదో గుర్తొచ్చిన దానిలా'' ఈ నవల మీకు నచ్చలేదన్నారు కదూ!'' అంది.



''అవును!'' అన్నాడు.

''ఎందుకని?''?

ఆ నవలని అన్నిసార్లు చదివేనన్నారు కదా! అది ఎందుకు నచ్చిందో మీరు ముందు చెప్పండి?'' అదే కిరీటి తెలివి తేటల ప్రత్యేకత. ఆమె తన అభిప్రాయం చెపితే ఆ ఆర్గ్యుమెంట్‌లోని లోపాలని పట్టేసి తన వాక్చాతుర్యంతో చెరిగెయ్యొచ్చనుకున్నాడు.

కానీ మైథిలి, ''ఎందరో మహానుభావులు ఎన్నో అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఆ మహోత్కృష్ట గ్రంథాన్ని పొగడటానికి నేనెంతటి దానివి'' అంది.

కిరీటి కేం మాట్లాడాలో తెలియలేదు.

''మీరు తెలుగు లెక్చరరా?'' వెర్రి నవ్వు అసందర్భంగా అడిగాడు

''కాదు. ఇంగ్లీషు!''

ఆ విషయం కొద్దిగా లేట్‌గానయినా కనిపెట్టినందుకు తనని తానే అభినందించుకున్నాడు కిరీటి. ఆ విషయం తెల్సుకోకుండా తను ఫోజు వెయ్యడానికి బట్లర్ ఇంగ్లీషులో మాట్లాడేస్తే ఆభాసుపాలయిపోయేవాడు.

''స్త్రీ స్వేచ్ఛ పేరున విచ్చలవిడితనాన్ని ఈ నవల అందించలేదూ?''

గొప్ప తెలివితో అన్నాడు కిరీటి. ఆమె అవును అంటే అవునని, కాదంటే కాదని అనడానికి వీలుగా గోడ మీది పిల్లి వాటంగా తన అభిప్రాయాన్ని వెల్లిబుచ్చాడు!

''లేదు! అది వితండవాదనలు చేసేవాళ్ళు, అజ్ఞానంలో, మూఢనమ్మకాలతో మునిగిపోయిన వాళ్ళు వాగే విధానం!'' అంది మైథిలి కొద్దిగా ఆవేశంగా.

''కానీ తొలి చూపులోనే తన వీపుని గుచ్చి గుచ్చి చూసిన వాడితో లేచి వచ్చేసిందంటే...'' అంటూ ఏదో వాగబోయాడు.

కానీ అతని మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ ''ఎవరు?'' అని ఎదురు ప్రశ్నించింది. కిరీటి ఇబ్బందిలో పడ్డాడు. ఎపుడో అదీ ఒకసారి ఆ నవలని చదివాడు అతను. అదీ అర్థమయి అర్థమవ్వనట్టు అర్థమయింది అతనికి. మెయిన్ థీమ్ గురించి తప్పించి మిగతా వేమీ పెద్దగా గుర్తులేవు!

''అదే హీరోయిన్''

''ఆమె పేరు?''

''ఏదో వుండాలి... గుర్తులేదు...''

''నాకు తెలుసు... గుర్తుండదు... ముందే ఒక తప్పుడు అభిప్రాయానికి కమిట్ అయిపోయి, ఆ నవలని విమర్శించడం కోసం దానిని పైపైన చూసేసి దాని గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడేవాళ్ళతో మాట్లాడటం శుద్ధ అనవసరం'' అంది మైథిలి సీరియస్‌గా.

పైకి జున్నుముక్కలా నాజూకుగా వున్న ఆమె అంత నిర్మోహమాటంగా కొట్టినట్లు తన అభిప్రాయం చెప్పేసరికి కిరీటి కొద్దిగా బెదిరాడు. ఈ విషయంలో కాంప్రమైజ్ అయిపోవడం ఉత్తమోత్తమం అనుకున్నాడు.

''ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి, వదిలెయ్యండి''

ఆమె ఏం మాట్లాడలేదు. సంభాషణ పొడిగించాల్సిన అవసరం అతనిది!

''నర్సాపురం మీ నేటివ్ ప్లేసా?''

అడిగాడు.

"అవును. ఆమె పొడిగా చెప్పింది.

"వెకేషన్ అని బయల్దేరారా?"

"కాదు. మా మామ్మగారికి సీరియస్ అని టెలిగ్రామ్ వస్తే బయల్దేరాను"

"ఓ ఐయామ్ సారీ.."

"కంగారు పడవల్సిన విషయమేం కాదు లెండి!"

"అదేమిటి?'

"నాకు పెళ్ళిచూపులు ఏర్పాటు చేసినప్పుడల్లా వాళ్ళు అలాగే టెలిగ్రామ్ ఇస్తారు!"

"ఐ రిపీట్ అదేమిటి?"


"మామూలుగా పెళ్ళి చూపులంటే రానని!... వాళ్ళ విషయం తెల్సున్నా టెలిగ్రామ్ చూసి ఆగలేక బయల్దేరి వస్తూంటా!'

"స్ట్రేంజ్!" అన్నాడు కిరీటి.

"అవును. స్ట్రేంజే! పెళ్ళి అనేది ఆడదానికెంత అవసరమో, మగాడికీ అంతే అవసరం. కానీ ఆడపిల్ల కలవాళ్ళు నానా హడావుడి చేసి ఎక్కడ పిల్లనివ్వలేమోనని నాటకం చేసి పెళ్ళి వాళ్ళని రమ్మని బ్రతిమాలడం, వాళ్ళు ఆలోచించుకుని దయతలచి వస్తామనడం, గంగిరెద్దుల్లా ముస్తాబయి దిగసుకుని పోయిరావడం, ఎప్పుడూ తిండి మొహాం ఎరగని వాళ్ళలా పంటికొక్కుల్లా మేసి, నోటికొచ్చినదంతా అడిగి పోవడం. నిజంగా ఈ పెళ్ళి చూపుల తతంగమంతా వెరీ స్ట్రేంజ్!" మైథిలి ఆవేశంగా అంది.

తన అభిప్రాయాల్ని కుండబద్దలుకొట్టినట్లు మాట్లాడే ఆమె అలవాటు ఈసారి కిరీటికి అనుకూలంగా పనిచేసింది. ఆమె అభిప్రాయాల్ని కాంట్రడిక్ట్ చెయ్యకుండా సపోర్టు చేసి ఆమెని ప్లాట్ చేసెయ్యాలనుకున్నాడు.

"బాగా చెప్పారు!... అంతటితో ఆ భాగోతం ముగుస్తుందా? కట్నకానుకల బేరం వుండనే వుంది! పుచ్చువంకాయల బేరంలా.. వీళ్ళు ఇంతకమ్ముతామనడం,



## ఆర్డర్!

సుబ్బారావు భార్య ఆందోళ్ళు మొగుణ్ణి సీరియస్‌గా అడిగింది. "వంట చేస్తావా, చెయ్యవా తేల్చి చెప్పు..?"

"వస్తావా, బతుకుతావా అని నిలేసి అడిగితే వంట చెయ్యక చస్తానా!"

"ఆ....!?"

—పోనీ (విశాఖపట్నం)

వాళ్ళు అంతకయితే కొంటామవడం— తల చుకుంటేనే అసహ్యమేస్తోంది! మొన్నామధ్య ఒక డైరెక్టర్ దీన్ని పశువుల అమ్మకంతో పోలుస్తూ గొప్ప సింబాలిక్‌గా తీశాడు'' అన్నాడు రాని ఆవేశాన్ని తెచ్చుకుంటూ—

''మీకు మారేజి అయిందా?''

''లేదు. అలా అడిగారేం?''

''ఏం లేదు. ఎవరికీ తెలియకుండా కట్నాలు గుట్టుచప్పుడు కాకుండా తీసేసుకుని ఆ తర్వాత కట్నాల సంతల్ని విమర్శించడమే కార్యక్రమంగా పెట్టుకున్న ప్రబుద్ధుల్ని వేవెరుగుదుము!'' అంది మైథిలి నెమ్మదిగా.

మొహం మీద పేడ నీళ్ళు చల్లినట్లయింది కిరీటికి. ఆమె ఎలా కనిపెట్టిందో కానీ, తననీ ప్రబుద్ధుల జాబితాలోకి ఎక్కించేసింది! మరొకడు మరొకడు అయితే ఈ దెబ్బతో నోర్మూసుకుని కూర్చునే వాడే. కానీ అలావదిలితే అతను కిరీటి అవడు!

''భలే చెప్పారు. అలాంటి హిపోక్రాట్ల్ని నేమూ చూశాము.. అసలు కట్నం అనేది ఆడాళ్ళు మగాడికెందుకివ్వాలో నాకసలు అర్థమవదండీ! మన వాళ్ళు ఆడదానివి మగాడితో సమానంగా ఎలాగా చూడరు. ఆ విషయాన్ని ప్రక్కకి పెట్టండి... భార్యవల్ల లాభం ఎక్కువుగా పొందేది మగాడే! వాడి ప్రతిరూపానికి రూపం ఇవ్వడం దగ్గర్నుంచీ, వంట వండి తిండి పెట్టడం వరకూ అన్నింటిలోను మగాడు ఆమెకి రుణపడే వుంటాడు. మరి అలాంటప్పుడు వాడు ఆమెకి కన్యాశుల్కం ఇవ్వడం కొంతవరకు నయమవుతుంది కానీ ఈ కట్నం మరీ ఘోరం.

కిరీటి ఉత్సాహంగా అన్నాడు. పైకి ఆ మాటలంటూ లోపల తన మాటల్లోని గూఢ అర్థాన్ని పెడ అర్థాన్ని తలుచుకుని తెగ ఆనందపడ్డాడు. ఇంతలో ట్రైన్ భీమవరం టౌన్‌లో ఆగింది.

''మీకు మిల్క్ తెస్తానుండండి!'' అని లేవబోయాడు.

''ఏం కాలు పూర్తిగా విరగలేదా?''

ఆ మాటలకి అభిమాన ధనుడెవడైనా ఆత్మహత్య చేసుకుంటాడు!

కానీ కిరీటి నవ్వాడు! అదేదో జోక్ అయినట్లు వెర్రి నవ్వు నవ్వి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

''ఇంతకీ ఎన్నో పెళ్ళిచూపులో చెప్పారు కాదు!'' అన్నాడు. సంస్కారం అన్న మాటకి అర్థం తెలియకపోయినా ఆ మాట విని వుంటే ఆ ప్రశ్న ఎవడూ వెయ్యడు!

''లెక్కపెట్టలేదు!'' కరుకుగా జవాబిచ్చింది మైథిలి.

''... ఎలా గుర్తుంచుకుంటార్లెండి!... మీరుమాత్రం కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోకండి'' అని ఉచితమైనదొకదానిని ఆమె అడక్కుండానే ఉదారంగా ఇచ్చేశాడు.

కానీ ఆమె దానిని తిప్పికొట్టింది.

''ఇచ్చేలా వుంటే ఎపుడో చేసుకునే దానివి!.. మరి మీరు సరిపోక పెళ్ళి చేసుకోవటం లేదా?''

''అబ్బే! అదేం లేదు!... అరేంజ్డ్ మారేజ్‌కన్నా లవ్ మారేజెస్ బెటర్ అని నా అభిప్రాయం!''

''వాట్ ఏ బాడ్ ఒపీనియన్...''

ఆ మాట చాలు కిరీటికి! విజృంభించెయ్యాలనుకున్నాడు.

"... లవ్ మారేజ్ లవల్ల వున్న లాభాలు అన్నీ ఇన్నీ కావండి! ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలియజేసుకుని... చేసుకునే పెళ్ళి నిజమైన బంధం!..."

"ఆపండి!.. మొదటిరోజు పరిచయం కాగానే రెండో రోజు పార్కుల చుట్టూ తిరిగే ప్రేమలు మరీ రోత పుట్టించేవిగా వున్నాయి"

కిరీటి నిర్ఘాంతపోయాడు. ఆమె అతనికి అర్థంకాని పజిల్‌లా కనిపిస్తోంది. ఆమె ప్రేమ వివాహాలని సపోర్టు చేస్తే, కొద్దిగా స్పీచ్ ఇచ్చి చివర్లో తన అభిరుచిలకి సరిపోయే అమ్మాయి ఇంకా దొరకలేదని డైరెక్టుగా చెప్పి, మిమ్మల్ని లవ్ చెయ్యాలనిపిస్తోందని ఇన్‌డైరెక్టుగా చెప్పాలనుకున్నాడు. కానీ అదంతా అడియాస అయింది.

నిజానికి అతని దృష్టిలో లవ్‌కున్న స్థానం ఆమె చెప్పిన రోతకన్నా అసహ్యమైనది. లవ్ ఇతని లాంటి వాళ్ళకి ఒక ఫ్రైవ్ పాస్! అందమైన అమ్మాయికనపడగానే ఆమెకి దగ్గరవడానికి 'లవ్ అనే మాటని వాడుతుంటారు వీళ్ళు!

"... మంచి కంపెనీ ఇచ్చారు! యు ఆర్ రియల్లీ గ్రేట్!"

ట్రైన్ నర్సాపురం పరిసరాల్లోకి వస్తూండటంతో ఆమెని ఉబ్బేసే ప్రయత్నంలో పడ్డాడు.


మైథిలి ఏం చెప్పాలో తెలియక చిరునవ్వు నవ్వింది.

"... అందమైన వాళ్ళని చూశాను. తెలివైన వాళ్ళని చూశాను. రెండూ వున్న వాళ్ళని చూడడం మాత్రం ఇదే మొదటిసారి!

ట్రైన్ లాస్ట్ స్టాప్‌లో ఆగింది.

కిరీటికి పూర్తి నిరుత్సాహంగా వుంది. ఎంతో సాధించి, ఆమెని ఎప్రోచ్ అవడానికి గల మరో మెట్టుని ఎక్కాలనుకున్నాడు.

## నో సెంటిమెంట్స్!



పార్లమెంట్‌లో 37వ నెంబర్ గదికి చాలా ప్రాముఖ్యత ఉంది! ఆ గదిలో రాజీవ్‌గాంధి ప్రతిపక్ష నాయకుడిగా ఉండేవారు! ఆ సమయంలోనే ఆయన హత్య కావించబడ్డారు! తర్వాత మాధవ్‌సింగ్ సోలంకి ఆఫీస్ ఆ గదిలోనే ఉండేది! ఆయన మంత్రి పదవి 'బోఫోర్స్' పుణ్యమా అని మున్నాళ్ళ ముచ్చటగా ముగిసిపోయింది! అప్పటినుంచి ఖాళీగా ఉన్న ఆ గదిలోకి మూఢనమ్మకాలంటే మండిపడే దినేష్‌సింగ్ గారు ప్రవేశించారు! విదేశాంగ శాఖ మంత్రిగా మరి ఈ గదిలో కూర్చుంటూ దినేష్‌సింగ్‌జీ ఏం సాధిస్తారో చూద్దాం మరి! ఆల్ ది బెస్ట్ సార్!!

—జూపిటర్

కానీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఏం సాధించలేకపోయాడు.

"నేను తెస్తానుండండి..."

ఆమె పెద్ద సూట్ కేస్‌ని నవ్వు మొహంతో అందుకున్నాడు కిరీటి.

దానికి వంద రూపాయిలు ఇస్తానంటే తప్ప రైల్వే పోర్టర్ అయినా అంత ఆనందం ప్రకటించడు! చచ్చేంత బరువువున్న సూట్‌కేసుని మొయ్యలేక మొయ్యలేక మోసాడు. అప్పటికే నొప్పిగావున్న కాలు మరింత నొప్పి పెడుతోంది.

బయటికి రాగానే రిక్షా వాళ్ళు వచ్చి వాళ్ళిద్దర్నీ చుట్టుముట్టారు.

"ఫెర్రీ రోడ్‌కేనా?"

ఆశగా అడిగాడు. ఆమె అవుననాలని 'బంగారుబొమ్మ'లావున్న ఆమె ప్రక్కన ఒకే రిక్షాలో కూర్చుని... రిక్షా కుదుపులకి...

"కాదు. పాలకొల్లు రోడ్‌కి వెళ్ళాలి... అంటూ ఒక రిక్షాలో కూర్చుని "థాంక్స్. మంచి కంపెనీ ఇచ్చారు బై" అని వెళ్ళిపోయింది మైథిలి.

కిరీటి కత్తివేటుకి నెత్తురుచుక్కలేని పాలిపోయిన మొహంతో ఆ రిక్షాకేసే వెర్రిగా చూడసాగాడు.

* * *

"ఒక్కతే పిల్ల.. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎవరూ లేరు! పిల్ల తండ్రికి పది ఎకరాల మాగాణీ, తల్లికి వంద తులాల బంగారం వుందట!..."

"అమ్మా! నేను ఇప్పుడిపుడే పెళ్ళి చేసుకోనని నీకు ఎన్నిసార్లు చెప్పాలి?"

"పెళ్ళి చేసుకోక ఏం చేస్తావు? ముద్దు ముద్దుగా ముప్పై ఏళ్ళు వచ్చాయి. ఇంకా బాలాకుమారుడి ననుకుంటున్నావేంటి?"

"అది కాదే! నేను సంపాయిస్తున్న వెయ్యి రూపాయలు నాకే బొటాబొటీగా సరిపోతాయి! తనకేలేదు... మెడకో డోలు అని..."

"పిచ్చి కన్నా! అదా నీ భయం!... చెప్పడమే మరిచిపోయా! పిల్ల హైదరాబాద్‌లోనే లెక్చరర్‌గా పనిచేస్తోందిట!"

"లెక్చరర్?"

"అవును... ఫొటో కూడా పంపారు, చూడు!"

ఆ ఫొటో చూసిన కిరీటి తుళ్ళిపడ్డాడు!

అది మైథిలి ఫొటో!!

ఆ సమయంలో అతనికి ఆమె అందం, లావణ్యం, సంస్కారం ఇవేవీ గుర్తురాలేదు. బంగినపల్లె మామిడి పండు, జున్నుముక్క, బంగారు బొమ్మ లాంటి విశేషణాల మాటే జ్ఞాపకం రాలేదు!

కానీ ఆమె అభిప్రాయాలు— కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడగల నేర్పు— అత్యధిక తెలివితేటలు— ఇవన్నీ గుర్తొచ్చాయి!

ఒక్క క్షణం ఆలోచించి ఆ ఫొటో తిరిగిచ్చేస్తూ చెప్పాడు.

"ఈ పిల్ల అవలొద్దు!"

"అదేం?"

"అమ్మా.... నీకు అర్థంకాదా... ఆ అమ్మాయి మంచిది కాదు... విసుగ్గా

అన్నాడు కిరీటి.


"నిజమే?"

"అవును... నాకు బాగా తెలుసు... ఆమె కారెక్టర్ మంచిది కాదు..."

కిరీటి ఎందుకల్లా అన్నాడంటే ఒకటే కారణం!

అతను అతి సాధారణ సగటు మగాడు!!

*




డిజైన్: కె.వి.వి. లక్ష్మి (హైదరాబాద్)